ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 సంచిక : 12 ఆగష్టు 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551
ఈ సంచికలో....
జూన్ 2016
అరుణాచలం
16-09-1984
జిన్నూరు
ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, అరుణాచలం, జూన్ 2016)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏదైనా అవసరం అయినప్పుడు మాట్లాడాలి, అవసరం లేకుండా మాట్లాడకూడదు. మనం మాట్లాడేది సాఫ్ట్‌గా ఉండాలి, స్వీట్‌గా ఉండాలి. ఎక్కువ మాట్లాడేవాడికి విలువ ఉండదు. అందుచేత అక్కడ అవసరం ఉంటే మాట్లాడాలి, అవసరం లేనప్పుడు మీరు మాట్లాడవద్దు. అది కూడా మౌనంతో సమానము. అయితే తక్కువ మాట్లాడటం వలన మనకు ప్రాణశక్తి కలిసివస్తుంది. కొంతమందికి లోపల గర్వం ఉంటుంది, పైకి కనబడనివ్వరు, గర్వాన్ని దాచుకొంటారు. అది చాలా ప్రమాదం. కొంతమందికి అప్పు ఉంటుంది, అది ఎవరికీ తెలియనివ్వరు. మరి వడ్డీ పెరిగిపోతుంది కదా! దాచుకొన్న గర్వం, దాచుకొన్న అప్పు రెండూ కూడా ప్రమాదం. మనిషి పతనమవ్వటానికి, ఒక మనిషి ఇంకో మనిషికి దూరం అవ్వటానికి గర్వమే కారణం అవుతుంది. మీరు అరుణాచలంలో ఉన్నప్పుడు ఆ గిరిని చూడగలిగినంతసేపు చూస్తూ ఉండండి. ఆయన చేసే పని సైలెంట్‌గా చేస్తాడు. మీలో రాబోయే జన్మలను తీసుకొనివచ్చే బలహీనతలు ఏమి ఉన్నాయో చూస్తాడు. వాటిని పల్చబడేటట్లు చేస్తాడు, వాటిని తొలగించుకోవటానికి మీకు సహాయం చేస్తాడు. అయితే అరుణాచలేశ్వరుడు చేసే పని సైలెంట్‌గా చేస్తాడు. మీకు ఏదైనా సహాయం చేస్తున్నా అది ప్రక్కవాడికి కూడా తెలియనివ్వడు. ఆ గిరిని చూసేటప్పుడు ఇది కొండే కదా అనుకొంటాము. దానిని చూసేటప్పుడు మనకు ఏమీ తెలియదు, దాని ప్రభావం మన మీద ఇన్‌డైరెక్ట్‌గా పడుతుంది. అది వాసనాక్షయం చేస్తుంది. మన ఆధ్యాత్మిక పురోగతికి

అక్కడ నుండి సహాయం అందుతూ ఉంటుంది.

మేము భగవాన్‌ను తీసుకోలేదు, భగవానే మమ్మల్ని తీసుకొన్నారు. ఆయన మమ్మల్ని తీసుకొన్న మూలంగా అలా పట్టుకొని ఉన్నారు లేకపోతే ఈపాటికి చెదిరిపోయేవారము. పిల్లి మార్గం, కోతి మార్గం అని చెపుతూ ఉంటారు. పిల్లి తన పిల్లను నోటితో పట్టుకొని డెస్టినేషన్‌కు తీసుకొనిపోతుంది. కోతిమార్గంలో కోతిపిల్ల తల్లిపొట్టను పట్టుకొని డెస్టినేషన్‌కు వెళుతుంది. ఈ లోపల పిల్ల కనుక వదిలేస్తే అది పడిపోయే ప్రమాదం ఉంది. పిల్లిమార్గంలో ఆ ప్రమాదం లేదు. పిల్లిమార్గం శరణాగతి, కోతిమార్గం జ్ఞానమార్గం. మీరు ఏ మార్గంలో ఉన్నారో ఆలోచించుకోండి. అసలు మన కుటుంబపరిస్థితి ఇలా ఉందేమిటి అని శరణాగతిలో అలా అనుకోడు. మనకు ఏ ట్రైనింగ్ ఇవ్వటానికి భగవంతుడు ఇలా పెట్టాడో అనుకొంటాడు. నీకు బెంగ వచ్చింది అంటే నువ్వు శరణాగతిమార్గంలో లేవు అని అర్థం. నువ్వు ఈశ్వరుడికి శరణాగతి చేస్తే మరి నీకు బెంగ ఎందుకు వస్తోంది? మీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా మీ శరణాగతి నిజంకాదు. మన బాధ్యత ఈశ్వరుడు తీసుకొన్నాడు అనే నమ్మకం మీకు లేని మూలంగా మీకు దుఃఖం వస్తోంది.

మన అందరికీ ఎవరి దేహం అంటే వారికి ఇష్టం. కాని అదే మన శత్రువు. భగవాన్‌తో మా అత్తగారు రోజూ నన్ను తిడుతున్నారు అని చెబుతావు అనుకో... మరి నీ శరీరాన్ని నువ్వు తిట్టుకోగలవా అంటారు భగవాన్. నీ శరీరాన్ని నువ్వు తిట్టుకోలేవు. నీ శరీరమే నీకు శత్రువు కదా! అంటే నీ శత్రువును మీ అత్తగారు తిట్టిపెడుతోంది. నువ్వు ఎలాగూ తిట్టుకోలేవు, ఆవిడను తిట్టనియ్యి. నీలో దోషాలు ఉంటే ఆవిడకు వెళ్ళిపోతాయి. నిజమైన అరుణాచలం మీ హృదయంలోనే ఉంటే ఇక్కడకు ఎందుకు వస్తున్నారు అంటే మీ శరీరాలు ఎంత నిజమో ఈ కొండా అంతే నిజం. ఈ శరీరం నేను అని మీరు అనుకొంటున్నారు. అలాగే శివుడు కూడా ఆ కొండను నేను అనుకొంటున్నాడు. ఇది ఎంత అబద్ధమో అది అంతే అబద్ధం. కాని మీరు అబద్ధాన్ని నేను అనుకొంటున్నారు కాబట్టి మనకు ఏదో స్థూలంగా గుర్తు ఉండాలి. ఈశ్వరుడు అశరీరుడు. ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు. ఈ జీవకోటిని వారి కర్మానుసారం నియమించేవాడు ఈశ్వరుడు, ఆయన అంతర్యామి. అది ఒక్కటే నిజం, మిగతావన్నీ మనోకల్పితాలు. ఇది ఒక నాటకశాల. నాటకం వేసే స్టేజి మీదకు ఒకడు వస్తాడు, వాడి పాత్ర అవ్వగానే దిగిపోతాడు. అలాగే ఈ శరీరాలు అన్నీ నీడలు. సినిమా తెర ఉంది. తెరమీద జమున, జమున అంటాము. అది జమున కాదు జమున నీడ. అలాగే ఈ శరీరాలు

మీ నీడలు. ప్రపంచం అనే తెరమీద వాటిని ప్లే చేసి ఎవరి పాత్ర అయిన వెంటనే వారిని తీసుకొని పోతాడు. ఇది అంతా నియమించేవాడే ఈశ్వరుడు. ఆయనే యజమాని.

మీకు రోజూ ఏమి జ్ఞాపకం వస్తాయి. మీ శరీరం, మీ కుటుంబం. ప్రతీ శరీరానికి ఒక కుటుంబం ఉంటుంది. ఈ శరీరం, ఆ కుటుంబం ఈ రెండింటిని వేసుకొని తిరుగుతూ ఉంటారు, అంతకంటే మీకు పని ఏముంది? చనిపోయేవరకు ఇదే పని కదా! మీ కుటుంబంలో అందరినీ అభివృద్ధిలోనికి తీసుకొని రావాలి అని కృషి చేస్తూ ఉంటారు. మీరు చేసే కృషి మీరు చెయ్యండి, చెయ్యవద్దు అని అనటంలేదు. ఈశ్వరునికి శరణాగతి చెయ్యండి. మీరు చేసేది మీరు చెయ్యండి. కొంత ఈశ్వరుడి మీద భారం వెయ్యండి. అందరినీ నడిపేవాడు ఆయనే కదా. అందుచేత ఆయనకు శరణాగతి చెయ్యండి. కష్టపడి మా కుటుంబాన్ని అభివృద్ధిలోనికి తీసుకొని వచ్చాము అని కొంతమంది అంటూ ఉంటారు. అప్పుడు ఈశ్వరుడు నవ్వుకొంటాడు. మీరు ఎవరు? మీరు ఒక పనిముట్టు మాత్రమే. వాళ్ళకు అభివృద్ధిలోనికి వచ్చేయోగం కనుక ఉంటే అభివృద్ధిలోకి వస్తారు. మీరు ఊరికే నిమిత్తమాత్రం. అందుచేత కర్తృత్వం పెట్టుకోవద్దు. నువ్వు అకర్తవు కాని నేను కర్తను అనుకొంటున్నావు. అది ఉద్ధరించాను, ఇది ఉద్ధరించాను అనుకొంటావు. అదే కర్తృత్వం. బయట కారణాల వల్ల మనిషికి దుఃఖం రాదు. మన దుఃఖానికి కారణం కర్తృత్వం.

ఈ పని చెయ్యటం వలన పుణ్యం వస్తుంది అని మనవాళ్ళు అలా చెపుతూ ఉంటారు. పుణ్యం కూడా చాలా ప్రమాదం. పుణ్యం ఎందుకు ప్రమాదం అంటే పుణ్యం వలన నీకు కొంత భోగం వస్తుంది. ఆ భోగం నువ్వు అనుభవిస్తావు. అనుభవిస్తే అది వాసనకింద పడుతుంది. ఆ వాసన మరల తలంపు కింద వచ్చి దానిని రిపీట్ చెయ్యమంటుంది. అదే సంసారం. ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే కాని మనది అనుకొంటున్నాము కదా! నేను కానిదానిని నేను అనుకొంటున్నావు. నాది కానిదానిని నాది అనుకొంటున్నావు. ఇలా అనుకొన్నంతకాలం నీకు సంసారం తప్పదు. సంసారం అంటే అందరికీ ఇష్టంగానే ఉంది కదా! అదే జైలు. నిన్ను అందులో నుండి బయటకు రానివ్వరు. నీ శరీరం ముసలిది అయితే జైలు మార్చేస్తారు అంతేగాని జైలు నుండి బయటకు వచ్చే సమస్య లేదు. నేను కానిదానిని నేను అనుకొన్నంత కాలము నాది కానిదానిని నాది అనుకొన్నంతకాలం జీవలక్షణాలు ఉంటాయి కదా! జీవలక్షణాలు ఉన్నప్పుడు సంసారం వచ్చేస్తుంది. అందులోనుండి బయటకు రాలేవు. మన శరీరాలు చనిపోవటం, మరల ఎక్కడో శరీరాలు రావటం ఇలా అందరికీ సంసారాలు అలవాటు

అయిపోవటం వలన ఈ సంసారమే జైలు అని తెలియటంలేదు. అయితే వాసనలు, సంస్కారాల ప్రభావం వలన అది జైలు అని మనకు తెలియటంలేదు. నువ్వు కానిదానితోటి నువ్వు తాదాత్మ్యం పొందుతున్నంతకాలం వాడికి శిక్షగా సంసారం ఇస్తాడు, అదే జైలు.

నేను లోకానికి ఉపకారం చెయ్యాలి అనుకొంటున్నాను నన్ను ఏమి చెయ్యమంటారు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు బాగా చదువుకొని ఇతరులకు బోధించు లేకపోతే నువ్వు బాగా డబ్బు సంపాదించి ప్రజలకు సహాయం చెయ్యి అని ఇటువంటివి ఏమీ ఆయన చెప్పలేదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, దానిని రిలైజ్ చెయ్యి. అప్పుడు నీ ద్వారా లోకానికి ఎవరూ చెయ్యలేనంత సహాయం జరుగుతుంది. అంతకంటే సుప్రీమ్‌గా నువ్వు లోకానికి ఏమీ చెయ్యలేవు. నా మనస్సులో ఏముందో ఈ మహర్షికి తెలుస్తోంది. వాడికి తెలిసిన ఫరవాలేదు, వాడికి తెలుస్తోందని నాకు తెలుస్తోంది, అదే ఇబ్బందిగా ఉంది. ఎందుకు అలా తెలియ పరుస్తున్నాడు అంటే ఆ వాసనను బలహీనం చేయటానికే అలా చేస్తున్నాడు. ఆయన నోటితో ఏమీ అనడు, గురువు చేసేది ఇన్నర్ వర్క్. నీ వాసనను బలహీనం చేసినవాడు గొప్పా, నీకు అన్నం పెట్టేవాడు గొప్పా. అన్నం పెట్టటం మంచిదే కాని నీకు రీబర్త్ లేకుండా చేసినవాడు ఇంకా గ్రేట్. మీ అనుగ్రహం కావాలి అని అడుగుతున్నారు అంటే భగవాన్ ఏమంటారు అంటే మేము ఇచ్చేది అదే, ఒకవేళ మీరు అడగకపోయినా మేము ఇచ్చేది అదే. మీరు ఇంకోటి అడిగినా మేము ఇచ్చేది లేదు, మా దగ్గర లేదు కదా! మా దగ్గర ఉన్నది ఇస్తాము కాని లేనిది ఎలా ఇవ్వగలము. అది అడిగించుకొని ఇవ్వటంకాదు, మీరు అడగకపోయినా ఇస్తాము ఎందుచేతనంటే మా దగ్గర ఉన్నది అదే, ఇంకోటి ఏమీ లేదు. నీకు జ్ఞానం రాదేమో అని భయం వేస్తోంది కాని వచ్చేస్తుంది. వచ్చేసినా ప్రమాదమే అప్పడే వచ్చేసిందా అనిపిస్తుంది. ఇప్పుడు మీ మనస్సు అంతర్ముఖం అవుతోంది అనుకోండి. మీ ఇంట్లో వారికి తెలుస్తుంది. మీరు ఇంట్లోనే ఉంటారు, యాంత్రికంగా ఉంటారు. వీళ్ళ శరీరాలు ఇక్కడే ఉన్నాయి బయటకు మనతోటి కలిసే ఉన్నారు కాని లోపల మానసికంగా మనకు దూరం అవుతున్నారు అని వాళ్ళకు తెలుస్తూ ఉంటుంది. డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ వస్తే ఇంక నువ్వు ప్రారబ్ధం కూడా అనుభవించ నక్కరలేదు. అంటే దేహానికి ప్రారబ్ధం ఉంటుంది. దేహము నేను అనేవాడు లోపల పోయాడు కదా, నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు ఇంక ఎవడూ ఉండడు. నీ దేహం ప్రారబ్ధం అనుభవిస్తూ ఉన్నా దాని ప్రభావం ఏమీ నీ మీద పడదు.

నీకు ఎవరికి ఏమీ ఇవ్వాలని ఉండదు అనుకో, ఒక అరటిపండు కూడా ఎవరికీ

ఇవ్వాలని ఉండదు అనుకో, దీని గురించి వేదంలో ఏమని చెప్పాడు అంటే నీకు ఎవరికీ ఏమీ ఇవ్వాలని బుద్ధిలేదు అనుకో అంటే నీకు గివింగ్ హేబిట్ లేదు అనుకో. తరువాత జన్మలో మీ అమ్మకు కూడా మీకు ఏమీ ఇవ్వాలనే బుద్ధిని కలుగనివ్వడు ఈశ్వరుడు. ఎక్కడో పరాయివాళ్లకు కాదు, మీ అమ్మకు ఎంత ఉన్నా ఏమో ఏదో ఒకటి చేసుకొంటుంది కాని నీకు మటుకు ఇవ్వదు. నీకు ఇవ్వాలనే బుద్ధిని మీ అమ్మకు కలుగజేయడు. వాడు ఈశ్వరుడు. ఇప్పుడు నేను చెప్పిన వాక్యం ఇప్పుడెంత నిజమో వెయ్యి సంవత్సరాల తరువాత కూడా అంతే నిజం. మాకు రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అంటారు. అదీ స్వప్నమే. మాకు ఇంటి దగ్గర చాలా ఇబ్బందిగా ఉంది అని కొంతమంది అంటారు. అదీ స్వప్నమే. రెండూ నిజంకాదు. మనకు ఎక్కడనుండి ఆనందం రావాలో అక్కడనుండి రాకుండా బయటనుండి హేపీనెస్ తీసుకొంటాము అనుకోండి దానికి క్రీస్తు ఏమని చెప్పాడు అంటే నీ ప్లెజర్ అంతా దుఃఖంగా మారిపోయేరోజులు వస్తాయి అన్నాడు. నువ్వు బయట నుండి కృత్రిమంగా హేపీనెస్ తీసుకొంటున్నావు అది అంతా సారో కింద మారిపోవును. ఎందుచేతనంటే అది నిజంకాదు, నీకు లోపల నుండి ఆనందం వస్తే ఫరవాలేదు కాని ఆనందంకోసం నువ్వు బయట వస్తువుల మీదో, మనుషుల మీదో ఆధారపడితే అది ఎప్పటికైనా సారోకింద మారిపోయే అవకాశం ఉందని బైబిల్‌లో చెప్పాడు. ఇప్పుడు నీకు ఎంత ప్లెజర్ వచ్చిందో దానికి వడ్డీతో సహా నీకు పెయిన్ వచ్చేస్తుంది. మీకు డబ్బు ఉంటే ఉండనివ్వండి. అందులోనుండి ప్లెజర్ తీసుకోవద్దు. మీకు అధికారం ఉంటే ఉండనివ్వండి. అందులో నుండి ప్లెజర్ తీసుకోవద్దు. బయటనుండి ప్లెజర్ తీసుకోవద్దు. బయట గొడవలు బయటే వదిలేయండి, వాటిని లోపలకు తీసుకోవద్దు. వాటిని లోపలకు తీసుకొంటే అది పెయిన్‌కింద మారిపోతుంది. పొగడ్తలు చాలా ప్రమాదము. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తుంది. అది మరల సారో కింద మారిపోతుంది.

నువ్వు శాంతిగా ఉండటానికి తిండి ఒక్కటే సరిపోదు. తిండి అందరికీ ఉంది కదా మరి అందరూ సుఖంగా, శాంతిగా ఉన్నారా? నువ్వు భగవంతుడికి శరణాగతి చేస్తే నువ్వు శాంతిగా ఉండటానికి భగవంతుడు మానసికంగా కొన్ని సమకూరుస్తాడు. అందుకే శరణాగతి. మీకు ఏ కొరత కారణంగా శాంతి లేదో ఆ కొరతల్ని తీరుస్తాడు. మీకు మనస్సు ఉన్నంతకాలం అనేక సమస్యలు వస్తాయి. ఒక సమస్య పరిష్కారం అయితే ఇంకో సమస్య వచ్చి కూర్చొంటుంది. శరీరాలు మారినా మనస్సు అదే కంటిన్యూ అవుతూ ఉంటుంది. ఏదో రోజున కాలి బూడిద అయిపోయే శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత మీకూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటానికి

ఇవ్వటంలేదు. ఈ మనస్సే నీకు నేనుగా వ్యక్తమవుతోంది. ఈ మనస్సు అనే సమస్యను పరిష్కారం చేసుకొంటే ఇంక నువ్వు శవాలను మోయనక్కరలేదు.

మీరు పుస్తకాలు చదివినా, పాండిత్యం సంపాదించినా, ధనం సంపాదించినా, పెళ్లిళ్ళు చేసుకొన్నా మానవుడు ఏ పని చేసినా ఆనందంకోసం, శాంతికోసం చేస్తాడు. మానవుడి యొక్క గమ్యం వాడు శాంతిగా ఉండాలి, ఆనందంగా ఉండాలి. మనం అన్వేషించే ఆనందం మన హృదయంలోనే ఉంది, బయట ఎక్కడా లేదు. బయట ఎక్కడో ఉందని భ్రాంతిపడి ఆనందంకోసం లోకం అంతా వెతుకుచున్నాము. కొంతమంది కళ్ళజోడు పెట్టుకొని నా కళ్ళజోడు ఎక్కడ ఉందని ఇల్లంతా వెదుకుతూ ఉంటారు. మనం చేసే సత్యాన్వేషణ అలాగే ఉంది. వాడు వెదికే శాంతి, ఆనందం ఈ లోకంలోగాని, స్వర్గలోకంలోగాని, కైలాసంలోగాని, వైకుంఠంలోగాని మరొక లోకంలోగాని ఎక్కడా లేదు, అది వాడి హృదయంలోనే ఉంది అనే అనుభవం మనిషికి ఈనాటికీ రావటంలేదు. మనం ఏవైతే వరాలు అనుకొంటున్నామో చివరకు అవి శాపాలకింద మారతాయి. శాంతి అనేది ప్రపంచంలో ఎక్కడా లేదు, మన హృదయంలోనే ఉంది అనేటువంటి విశ్వాసం, ఆ నమ్మకం ఇంకా మనకు కలగటంలేదు, ఎందుకు కలగటంలేదు అని భగవాన్‌ను అడిగితే దానికి మన అలవాట్ల యొక్క వేగం కారణం అని చెప్పారు. మన అలవాట్ల యొక్క వేగం వలన మనస్సు అంతర్ముఖం అవ్వటంలేదు. మనస్సులో ఉన్న పొల్యూషన్ వలన, మన మనస్సుకు అంటుకొన్న మసి వలన మనకు అంతర్దృష్టి రావటంలేదు.

నీకు శరీరం తాలుక, మనస్సు తాలుక అనుభవం ఎలా ఉన్నాయో అలాగ సత్యం నీకు అనుభవంలోనికి వచ్చేవరకు నువ్వు చేసే కర్మవలనగాని, ధ్యానంవలనగాని, సాధనలవలనగాని నీకు శాంతి దొరకదు, ఆనందం దొరకదు, స్వేచ్ఛ దొరకదు. ఎందుచేతనంటే ఇవి అన్నీ అక్కడే ఉన్నాయి. నీకు ఆనందం కావాలి, శాంతికావాలి. అది లేని చోట వెదికితే నీకు దొరకదు. ఉన్నచోట వెదకండి. తట్టండి తెరువబడుతుంది, అడగండి ఇవ్వబడుతుంది. మనం ఏదయితే పొందుదామనుకొంటున్నామో దాని తాలూకు దయలేకుండా, దాని తాలూకు అనుగ్రహం లేకుండా, దానికి సంతోషం కలిగించే పనులు మనం చెయ్యకుండా అది మనకు తెలియబడదు. చిన్నచిన్న విషయాలలో జాగ్రత్తగా ఉంటే మీకు రీలైజేషన్ వచ్చేస్తుంది. మీలో చాలామంది కష్టపడి పనిచేస్తారు. గౌరవం వస్తుంది అంటే ఆ పని చేస్తారు, గౌరవం రాదు అంటే పని చెయ్యరు. గౌరవం కోసం, గుర్తింపుకోసం కాకుండా పనిపనికోసమే చేయాలి, అక్కడ అవసరం ఉంది కాబట్టి చేయాలి, అక్కడితో చేసిన పని మర్చిపోవాలి అంతే. మీరు

గౌరవం ఆశించి పనిచేస్తే గౌరవం వస్తుంది కాని ఈశ్వరుని దయ మీకు కలుగదు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. గౌరవం వలన ఎవడికీ జ్ఞానం రాదు, ఈశ్వరుడి అనుగ్రహం ఉంటే జ్ఞానం వస్తుంది.

మన శరీరానికి జబ్బులు ఎలా ఉంటాయో అలాగే మనస్సులో కూడా జబ్బులు ఉంటాయి. కీర్తి అనేది ఒక మానసిక జబ్బు. శరీరానికి సంబంధించిన జబ్బులు తగ్గకపోయినా ఫరవాలేదు. ఎందుచేతనంటే స్మశానంలో శరీరం కాలిపోయినప్పుడు ఆ జబ్బులు కూడా కాలిపోతాయి, కానీ మనస్సులో ఉన్న జబ్బులు అలా కాలవు, మరణానంతరం మనతో కూడా వచ్చేస్తాయి. అందుచేత ఓ అరుణాచలేశ్వరుడా! ఈ శరీరం అగ్నికి ఆహుతి అయ్యి కాలి బూడిద అవ్వకముందే నువ్వు నా మనస్సును సరిచేసి, అందులో జ్ఞానం రావటానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని కాల్చి బూడిద చెయ్యి. ఎన్నో జన్మలనుండి వస్తున్న వాసనలను నేను ఒక్కడినే తొలగించుకోలేను, నీ సహాయం అవసరం. నా ప్రయత్నంతో పాటు నీ అనుగ్రహం ఉంటే ఆ పని పూర్తి అవుతుంది, లేకపోతే పని పూర్తి అవ్వదు అన్నారు భగవాన్. మీరు కష్టపడి పనిచేస్తున్నా, దేవుని అనుగ్రహం కనుక లేకపోతే మీకు కలిసిరాదు. మీరు గుడిలోకి వెళ్ళినా, గుడి చుట్టూ తిరిగినా, కొండ చుట్టూ తిరిగినా, ఏ దేవతలను ఆరాధించినా అది మీకు తెలిసున్నా, తెలియకపోయినా మీ లోపల ఉన్న ఆనందాన్ని, శాంతిని పట్టుకోవటానికే ప్రయత్నం చేస్తున్నారు. అంటే అక్కడికి చేరుకోవటానికే ఈ ప్రయత్నాలు అన్నీ చేస్తున్నాము అని మీకు తెలియకపోవచ్చు.

పురుషులు అందరు మేము పురుషులం అనుకొంటారు. స్త్రీలు అందరూ మేము స్త్రీలు అనుకొంటున్నారు. ఆ శరీరాలను బట్టి అలా అనుకొంటున్నారు. శరీరానికి సెక్స్ ఉంది కాని చైతన్యానికి సెక్స్ లేదు. చైతన్యం నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు అసలు పెళ్ళి చేసుకొందామా వద్దా అనే ఆలోచనలు ఏమీ రావు. ఎందుచేతనంటే చైతన్యానికి సెక్స్ లేదు. శరీరాల దగ్గరకు వచ్చేటప్పటికి పెళ్ళిళ్ళు అవసరమవుతున్నాయి. ఎందుచేతనంటే బాడీకి సెక్స్ ఉంది. నువ్వు బాడీ కాంక్షస్ దాటి వెళ్ళగలిగితే నీకు పెళ్ళితో పనిలేదు. పెళ్ళిళ్ళు చేసుకోకూడదు అని కాదు, నీకు అవసరంలేదు. మీరు వివాహం చేసుకోలేదు అని భగవాన్‌ను అడిగితే నేను పెళ్ళి చేసుకోవాలి అని అనుకోలేదు, పెళ్ళి చేసుకోకూడదు అని అనుకోలేదు, అసలు నాకు ఆ ప్రశ్న ఉదయించలేదు. ఇలా ఉండాలి అని ప్రయత్నం నాకు ఏమీ లేదు అన్నారు. ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. మీరు చేసేపని కూడా దేవుడే. మీరు ఇంటిదగ్గర

పనో, సమాజానికి సంబంధించిన పనులో ఏవో చేసుకొంటున్నారు కదా! అది కూడా దేవుడే అన్న సంగతి మర్చిపోకండి. మీరు ఏమనుకొంటున్నారు అంటే మీరు చేసే పూజలు, గుడులు చుట్టూ తిరగటం అదే దేవుడి పని అనుకొంటున్నారు. గుడికి వెళ్ళి వస్తున్నారు, దేవుడి పని అయిపోయింది అనుకొంటున్నారు. అలాకాదు. మీరు ఇంటి దగ్గర చేసుకొనే ప్రతీ పని దేవుడే. అది మీకు అర్థమైతే జాగ్రత్తగా ఉంటారు, మీకు తెలియకుండానే మీరు భగవదనుభవం పొందుతారు. మీరు పూజే దేవుడు అనుకొంటున్నారు కాని ప్రతీక్షణం మీరు చేసే పని అంతా కూడా దేవుడే. అది గుర్తు పెట్టుకోండి.

మీకు, మీ స్నేహితులకు ఏమైనా అభిప్రాయబేధాలు ఉంటే కూర్చుని మాట్లాడుకోండి. లోపల అనుమానాలు పెట్టుకొని దూరమైపోవద్దు. అది చిన్న అభిప్రాయబేధమైనా మీరు పరిష్కారం చేసుకోవాలి. అది క్లియర్ చేసుకోకుండా ఆ నిప్పురవ్వను అలా వదిలేస్తే ఇంటిని తగులబెడుతుంది. మీ ఇంట్లో అయినా సరే అంతే. మీ ఇంట్లో వారికి మీకు ఏమైనా అభిప్రాయబేధాలు ఉంటే క్లియర్‌గా మాట్లాడుకొంటే అక్కడితోటి ఆ నిప్పురవ్వ ఆరిపోతుంది. అలాకాకుండా ఆ నిప్పురవ్వను మీరు నెగ్లెట్ చేస్తే అది పెరిగి పెరిగి చివరకు ఇల్లుని కాల్చేస్తుంది. ఎ స్పార్క్ నెగ్లెక్టెడ్ బర్న్స్ ద హౌస్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-09-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇప్పుడు కష్టపడి ఏదో సాధన చేసుకొంటున్నాము మరణించిన తరువాత మోక్షం పొందుతాము అని మనందరమూ అనుకొంటూ ఉంటాము. మనం పొందేది ఏదో ఇప్పుడు ఇక్కడ లేదని మరణించిన తరువాత కైలాసంలోనో, వైకుంఠంలోనో దానిని పొందుతాము అని మీరు ఆలోచిస్తూ ఉంటే ఇలా ఇక్కడకు 100 సంవత్సరాలు వచ్చినా నేను చెప్పే విషయం మీకు అర్థం కాదు. మరణించిన తరువాత మనం ఏదైతే పొందుదాము అనుకొంటున్నామో అది ఇప్పుడూ ఉంది, ఇక్కడే ఉంది, మనకు అత్యంత సన్నిహితంగా మన హృదయంలోనే ఉంది అనేటటువంటి నిర్ధారణకు ముందు మీరందరూ రావాలి. ఇందులో రాజీ ప్రసక్తి లేదు. మీరు ఏదైతే పొందుదాము అనుకొంటున్నారో అది ఇక్కడే ఉంది అనే ధృఢనిశ్చయం కనుక మీకు రాకపోతే అది మీకు అందదు. నేను చెప్పే విషయాలు మీ బుద్ధికి అందకపోయినా కాని విశ్వాసం మటుకు కుదుర్చుకోండి. మిమ్మల్ని నేను గౌరవించాలనుకొంటున్నాను, ఎలా గౌరవించాలి అని ఒక పెద్దమనిషి నన్ను అడిగాడు. ఆయన సిన్సియర్‌గానే అడిగాడు. దండలు

వేయటం వలన గౌరవించటం కాదు. గౌరవం, అగౌరవం కేవలం ప్రకృతికి సంబంధించిన విషయాలు. మన మనస్సుతో మనం ప్రకృతిలో ఉంటున్నాము కాబట్టి గౌరవం ఏదో గొప్పదని, అగౌరవం తక్కువదని అనుకొంటున్నాము. ఇవి రెండూ ప్రకృతే. నేను చెప్పే మాటలను ప్రోపర్‌గా, నా హృదయంలో నుండి ఏ స్పిరిట్‌తో ఆ మాట వస్తోందో, ఆ మాటను ఉన్నది ఉన్నట్లుగా మీరు అర్థం చేసుకోవడమే నన్ను గౌరవించటం, అంతకంటే ప్రత్యేకంగా గౌరవం అనేది లేదు. మీరు నాకు దండలు వేస్తే గౌరవం అలా ఏమీ అనుకోనక్కరలేదు. మీరు నమస్కారాలు కూడా ఏమీ పెట్టనక్కరలేదు. నేను చెప్పే మాటలను అర్థం చేసుకొనే బుద్ధి కాని, అర్థం చేసుకొనే శక్తికాని లేకపోతే మీరు దండలు వేసిన అది నన్ను గౌరవించినట్లు కాదు. దండలు, దండాలు ఇవన్నీ బాహ్యమైన గౌరవానికి సంబంధించిన విషయాలు, ఇవి అన్నీ మన సాంప్రదాయాన్ని బట్టి వచ్చినవి. గొప్ప విషయం ఏమిటి అంటే అర్థం చేసుకొనే హృదయం. అది జీవితంలో చాలా కష్టం. నేను మాట తేలికగా చెపుతున్నాను. దానిని అర్థం చేసుకోవటం నేను చెప్పినంత తేలికకాదు. అర్థం చేసుకొనే హృదయం కనుక ఇక్కడ లేకపోతే అది అవగాహన కాదు

సత్యవస్తువు మన హృదయంలో ప్రత్యక్షంగా ప్రకాశిస్తోంది. అది చైతన్యవస్తువు. మనకు సూర్యుడు కనబడకుండా మేఘాలు ఎలా అడ్డు వస్తున్నాయో అలాగే హృదయంలో ఉన్న వస్తువు మనకు తెలియకుండా మన అంతఃకరణంలో ఉన్న దోషాలు మనకు అడ్డు వస్తున్నాయి. మేఘం సూర్యుడికంటే చాలా తక్కువది అయినప్పటికీ సూర్యుడు మనకు కనబడకుండా మాత్రం చేయకలుగుతోంది. అదే విధంగా ఆత్మతో పోల్చుకొంటే ఈ కామం, అసూయ, ద్వేషం ఇవి అన్నీ బహుస్వల్పవిషయాలు, అల్ప విషయాలు అయినప్పటికీ ఆత్మ మనకు తెలియబడకుండా ఇవి అడ్డువస్తున్నాయి. వాటిని తొలగించుకోవటమే సమస్త సాధనల యొక్క లక్ష్యం. మా అబ్బాయికి తెలివితేటలు లేవు అంటారు. తెలివితేటలు కూడా చిన్న విషయం అనుకోకండి. ఎక్స్‌పీరియన్స్‌లోనుండి తెలివితేటలు వస్తాయి కానీ ఊరికే గాలిలో నుండి రావు. కొంతమంది 20 సంవత్సరాల కుర్రవాళ్ళు 60 సంవత్సరాలు అనుభవం ఉన్న వారిలా ఆలోచిస్తారు. కొంతమంది 60 సంవత్సరాలు వచ్చినా మెచ్యూరిటీ ఉండదు. అంటే వారికి జీవితంలో తగినంత అనుభవం దొరకలేదు. అనుభవంలోనుండి ఇంటిలిజెన్సు వస్తుంది.

మీరందరూ పురాణాలు చదువుతున్నారు, గురువుల దగ్గరకు వెళుతున్నారు, జీవితంలో ఏదో నేర్చుకొంటున్నారు. అయితే మీరు నేర్చుకొనేది రైట్ లెర్నింగా లేకపోతే రాంగ్ లెర్నింగా?

6కు 4 కలిపితే 10 అవుతుంది. మేము 11 అని నేర్చుకొన్నాము అంటే అది నిజం కాదు. మీకు అలా చెప్పి ఉండవచ్చు, మీరు నేర్చుకొని ఉండవచ్చు. మీరు నేర్చుకొన్నదంతా నిజంకాదు. నువ్వు ఈ శరీరం కాదు, మనస్సు కాదు, నువ్వు ఆత్మస్వరూపుడవు. అయితే మనం ఏమి నేర్చుకొంటున్నాము. చిన్నప్పటినుండి ఈ శరీరాన్ని నేను అని నేర్చుకొంటున్నాము. అంటే మన వ్యక్తిత్వంఅంతా ఈ శరీరానికి, మనస్సుకు, యింద్రియాలకు పరిమితం అయిపోతోంది. ఆత్మను తెలుసుకోవాలి అని మాటవరసకి అంటారు కాని అది కూడా తప్పే. ఆత్మను తెలుసుకోవటం అంటే తెలియబడేది, తెలుసుకొనేది రెండు ఉంటాయా? అది కూడా తప్పే. ఉన్నది ఒకటే వస్తువు. ఈ శరీరాన్ని నేను, మనస్సును నేను, మనకు తలంపులు వస్తున్నాయి కదా ఆ తలంపులు నేను అని మనం నేర్చుకొన్నాము కదా. మనం నేర్చుకొన్నది నిజం అవుతుందా? రాంగ్ లెర్నింగ్ రైట్ లెర్నింగ్ ఎలా అవుతుంది. మీకు నేర్చుకొన్న విషయాలనుండి ముందు బయటకు రండి. వైకుంఠంలో మోక్షంఉంది, కైలాసంలో మోక్షం ఉంది, మరణించిన తరువాత మనకు మోక్షం వస్తుంది ఈలోపు మనం ప్రయత్నం చేసుకొందాము అనుకొంటున్నాము మీరు మరణాన్ని ఒక హద్దు (బోర్డర్) కింద పెట్టుకొంటున్నారు. జ్ఞానికి మటుకు అది ఒక హద్దు కాదు. జాగ్రత్తగా వినండి, కన్ఫ్యూషన్ వద్దు. నా ఒంటిమీద చొక్కా ఉంది, ఆ చొక్కాను తీసి ప్రక్కన పెట్టాను. నేను మనిషిని మారిపోయానా? చొక్కా ఉన్నప్పుడు ఎలా ఉన్నానో, చొక్కా తీసి ప్రక్కన పెట్టినప్పుడు కూడా అలాగే ఉన్నాను. అదే విధంగా జ్ఞానికి దేహం ఉన్నా, దేహం లేకపోయినా ఒక్కటే. వాడిలో ఏమీ మార్పు ఉండదు.

మనలో రాంగ్ థింకింగ్ ఉంది అని ఎందుకు అంటున్నాను అంటే వారి పని బాగుంది, మా వాళ్ళు చాలా కష్టాలు పడుతున్నారు అని చాలామంది అంటారు. ఇవన్నీ తప్పుడు స్టేట్‌మెంట్స్. సుఖం, దుఃఖం రెండూ అబద్ధమే. మీ యింద్రియాలతో మీకు ఇష్టమైనది అనుభవిస్తే అది సుఖం అని, మీరు కోరుకొనే వస్తువులు దొరక్కపోతే అది దుఃఖం అని అనుకొంటున్నారు. రెండూ అబద్ధమే. జ్ఞానికి సుఖం అంటే ఎట్రాక్షన్ ఉండదు, దుఃఖం అంటే రిపల్షన్ ఉండదు. వీటికి అతీతంగా ఉంటాడు. ఆయన స్వరూపం శాంతి. సుఖం అనేది ఒక తలంపు, దుఃఖం అనేది ఒక తలంపు, ఈ రెండు అబద్ధం. మన డాక్టరుగారు 80మైళ్ళు ఇక్కడకు కారులో వచ్చారు అనుకోండి. మరల 80 మైళ్ళు వెనక్కి వెళ్ళితే కాని ఆయన ఇంటికి వెళ్ళలేరు. 80 మైళ్ళు ప్రయాణం చేసి వచ్చి తిరిగి 40మైళ్ళు వెళ్ళి మన ఇల్లు ఇంకా రాలేదు ఏమిటి అంటే ఎలాగ? మీరు తిరిగి 80 మైళ్ళు వెళ్ళవలసిందే. అలాగే మనం ఆత్మను వదిలి ప్రకృతిలోకి

ఎంతదూరం వచ్చామో మరల మనం కష్టపడి అంతదూరం వెనక్కి ప్రయాణం చేయవలసిందే. వస్తువు మన హృదయంలోనే ఉంది. మనం దానిని విడిచిపెట్టి ప్రకృతితో కలిసిపోయి యింద్రియాలతో భోగాలు అనుభవిస్తూ ఎంతో దూరం ప్రయాణం చేసాము, తలంపులతో ఎంతో దూరం వచ్చేసాము. మరల తలంపులను వెనక్కిలాగిలాగి ప్రకృతిలోకి ఎంతదూరం వచ్చామో అంతదూరం వెనక్కి వెళ్ళితే కాని మనం దానిని పొందలేము. మేము సుఖాలు అనుభవిస్తున్నాము, భోగాలు అనుభవిస్తున్నాము అని మీరు అనుకొంటున్నారు కాని మీరు ఆత్మకు దూరం అయిపోతున్నారు అన్న సంగతి మీకు తెలియటం లేదు.

గౌతమబుద్ధుడు ఒక మహాసామ్రాజ్యానికి చక్రవర్తి. ఆయనకు భోగం అనుభవించటం చేతకాదా? భోగాన్ని ఎంజాయ్ చెయ్యలేడా? బాహ్యంగా ఆయనకు ఏ లోటూ లేదు. భోగవస్తువులు అన్నీ చేతికి అందుతున్నాయి అయినా భోగం కోరలేదు. ఆయనకు లోపలనుండి వైరాగ్యం వచ్చింది, ఆయనది నిజమైన వైరాగ్యం. భోగవస్తువులు చేతికి అందనప్పుడు నిరాశవల్ల కొంతమందికి వైరాగ్యం వస్తుంది, అది నిజంకాదు. కొంతమందికి ఆశ ఉంటుంది. ఆశ నెరవేరకపోతే వైరాగ్యం వస్తుంది. అది టెంపరరీ. నిరాశవల్ల వచ్చే వైరాగ్యం నిలబడదు, వివేకం వల్ల వచ్చే వైరాగ్యం నిలబడుతుంది. అయితే లోకంలో నిరాశ వల్ల వైరాగ్యం వచ్చే వారే ఎక్కువ. ప్రతి చిన్న విషయం అబ్జర్వేషన్‌లో పెట్టండి. ఒకోసారి నీ మనస్సు నీకు తెలియకుండా ఎటో పోతూఉంటుంది. అంటే అబ్జర్వేషన్ ఆగిపోయిందన్నమాట. మనస్సు నా ఎరుకలో ప్రవర్తిస్తూ ఉంటే నా మనస్సు అబ్జర్వేషన్‌లో ఉన్నట్లు గుర్తు. కొంతమంది పెద్దగా అరుస్తూ ఉంటారు. అంటే లోపల ఇంట్లో వారి మీదో బయటివారిమీదో కోపమో, అసూయో ఏదో ఉండి ఉండాలి. లేకపోతే కేకలు, అరుపులు రావు. మనం ఏదయినా పని చెయ్యాలి అంటే శరీరానికి శక్తి అవసరం. మీకు శక్తి లేకపోతే పనిచెయ్యలేరు. మాకు ఎక్కువగా కష్టాలు వస్తున్నాయి, తట్టుకోలేకపోతున్నాము అని అంటారు. అంటే మనస్సులో శక్తి తక్కువగా ఉంది. అంటే మన శరీరానికి శక్తి అవసరం. అది ఆహారం తీసుకోవటం వల్ల రావచ్చు. మీ మనస్సులో వచ్చే కష్టాలు తట్టుకోవటానికి మనస్సుకు శక్తి అవసరం, ఆశక్తి శరణాగతివల్ల వస్తుంది. మీరు ఈశ్వరుడిని శరణు వేడుకొంటే మీ మనస్సుకు శక్తి వస్తుంది. ఆహారం వలన శరీరానికి శక్తి పుడుతుంది, శరణాగతివల్ల మనస్సుకి శక్తి పుడుతుంది. ఎప్పడయితే శరణాగతివల్ల మీ మనస్సు కు శక్తి వచ్చిందో అప్పడు దైనందిన జీవితంలో వచ్చే కష్టాలను మీరు ఎదుర్కోగలరు. అయితే ఇక్కడ ఎవరికయినా శరణాగతి ఉందా? మీరు పొందిన శరణాగతి నిజమయితే అసలు ఈ ప్రశ్న ఉదయించదు. అందుచేత ఆధ్యాత్మిక

జీవితంలోనికి వచ్చాక అసలు అనుమానాలు పెట్టుకోకూడదు.

మీ హృదయం ఒకరకంగా ఉంటుంది, మెదడు ఒకరకంగా ఉంటుంది. మాట ఒక రకంగా ఉంటుంది. అంటే మూడూ మూడురకాలుగా ఉంటాయి. అది పాపం యొక్క లక్షణం. పాపం లేనివాడికి హృదయంలో ఏముందో, అదే మెదడులో ఉంటుంది, మెదడులో ఉన్నదే మాటద్వారా వస్తుంది. అయితే మనం పాపి అంటే ఎవరు వూరుకొంటారు. అందుచేత మిమ్మల్ని మీరు జడ్జి చేసుకోండి. మీరు నన్ను అంటే నేను ఊరుకోను, నేను మిమ్మల్ని అంటే మీరు ఊరుకోరు. అందుచేత మీలో పాపం ఉందో లేదో మీరు చూసుకోండి. శరీరంలో ఒక్క భాగంలో రోగం ఉన్నా మొత్తం శరీరం అంతా బాధకు గురి అవుతుంది. అన్ని రోగాలు అక్కరలేదు. అలాగే నీ మనస్సులో ఒక్క దుర్గుణం ఉంటే చాలు అది సత్యాన్ని తెలుసు కోకుండా ఆపేస్తుంది. అన్ని చెడ్డగుణాలు ఉండనక్కరలేదు. ఒక్క చిన్న దుర్గుణం ఉన్నాచాలు. అది సత్యాన్ని తెలుసుకోకుండా ఆపుచేసేస్తుంది. నేను చెప్పే విషయాలు అర్థం చేసుకోవటం వలన మీరు నాకు ఉపకారం చేస్తున్నారా లేక మీకు మీరు ఉపకారం చేసుకొంటున్నారా? నేను చెప్పే విషయాలు అర్థం చేసుకోమని మిమ్మల్ని అడుగుతున్నాను, దానివలన నాకు ఉపకారం ఏమిటి? నాకు ఏమీ ఉపకారం లేదు. నేను చెప్పే విషయాలు అర్థం చేసుకొంటే మీకు తెలియకుండానే మీరు ఆత్మను తెలుసుకోవటానికి ఉపయోగపడతాయి కాబట్టి మీకు మీరే ఉపకారం చేసుకొంటున్నారు.

తలంపులు ఆగిపోతే పనులు జరగవేమోనని చాలామందికి భయం. మన ప్రణాళికల కంటే ఈశ్వరుడు గొప్ప ప్రణాళిక రచయిత. నిజమైన ప్రణాళిక రచయిత ఈశ్వరుడే. సినిమాలో తెరమీద బొమ్మలు కనిపిస్తాయి. వాళ్ళు యాక్ట్ చేస్తూ ఉంటారు. కాని వారిచేత యాక్ట్ చేయించే డైరెక్టర్ మనకు కనబడడు. చేసేదంతా డైరెక్టరే. ఈశ్వరుడు మన శరీరాలను యాక్ట్ చేయిస్తున్నాడు. మీరు నాకు ఏదైనా అపకారం చేస్తారనుకోండి నాలో ప్రారబ్ధం ఏదో ఖర్చు అవ్వవలసి ఉంది అందుచేత మీ శరీరాన్ని ఉపయోగించుకొని అలా చేయిస్తాడు. మీ శరీరాన్ని బొమ్మకింద ఉపయోగించుకొంటాడు. ఇది నాకు అర్థమైతే ఇంక మీ మీద నాకు కోపం రాదు, ద్వేషం రాదు. నా ప్రారబ్దం ఖర్చు అవ్వటం కోసం మిమ్మల్ని అక్కడ అరేంజ్ చేస్తాడు. సినిమాలో విలన్‌లను చూస్తే మనకు కోపం వచ్చేస్తుంది, అసహ్యించుకొంటాము. కాని హీరోలో ఉన్న శక్తిని బయటకు తీసుకొచ్చేవాడు విలన్. ఒక రావణాసురుడు లేకపోతే రాముడి గొప్పతనం మనకు తెలియదు.

చావు అంటే అందరికి భయం. చావు వస్తే మనకు నష్టం ఏమిటి? మరణం తరువాత మనం రోజూ చూసే మనుషులు, వస్తువులు కనబడవు. వారిమీద ఉన్న ఎటాచ్‌మెంట్ వలన, మోహం వలన మరణం అంటే మీకు భయం కలుగుతోంది. మీకు దేనిమీద మోహం లేదు అనుకోండి, ఎటాచ్‌మెంట్ లేదు అనుకోండి అసలు మీకు చావు అంటే భయం కలగదు. మీరు ప్రాక్టికల్‌గా ఎందుకు ఆలోచించరు? వెళితే పురాణాలలోకి వెళ్ళిపోతున్నారు లేకపోతే చనిపోయిన తరువాత ఏమౌతాము అని ఆలోచిస్తున్నారు. ఇలా జీవించటం ఎందుకు? ఇప్పుడు మీరు ఇక్కడ కూర్చున్నారు. ఈ వర్తమానకాలాన్ని ఎందుకు వదిలేస్తున్నారు? అయితే భూతకాలం గొడవ లేకపోతే భవిష్యత్ గొడవ. ఇప్పుడు మీ గురించి మీరు ఆలోచించుకోవటం లేదు. ఇదే మాయ. మీరు ఎనాలసిస్ చేసుకోండి. మేము కృషి చేస్తున్నాము, మేము సాధనలు చేస్తున్నాము అని చాలామంది అంటారు. మీరు కోరికతో చేసే కర్మ మీకు దారి కనబడనివ్వదు. కోరికతో చేసే ప్రతీ పని మిమ్మల్ని బంధిస్తుంది కాబట్టి అది మీకు దారి చూపించదు. మీ గురించి మీరు తెలుసుకోవటానికి ఎప్పుడైనా ప్రయత్నం చేసారా? ఒకవేళ మీకు అశాంతి వస్తోంది అనుకోండి అశాంతి ఎందుకు వస్తోంది? ఎప్పుడు వస్తోంది? ఎలా వస్తోంది? అని ఎప్పుడైనా ఆలోచించారా? మీకు ధనం ఉంటే ధనం వలన వచ్చే భోగం వస్తుంది కాని ఆత్మ ఇచ్చే శాంతి మీకు రాదు. ధనం చేసే పని అది చేస్తుంది కాని అది మీకు శాంతిని ఇవ్వలేదు.

ఎదుటివారికంటే మీరు తక్కువ అనుకోవద్దు, ఎక్కువ అనుకోవద్దు. రెండూ కూడా చెడ్డే. ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ ఎంత చెడ్డో సుపీరియారిటీ కాంప్లెక్స్ అంతే చెడ్డ. హనుమంతుడిని చూడండి ఎంత బలమైన వాడో. ఆయన సర్వశక్తిమంతుడు, చదువు కూడా ఉంది, వ్యాకరణంలో పెద్ద పండితుడు. ఆయనకు బుద్ధిబలం ఉంది, దేహబలం ఉంది. అయినా హనుమంతుడు అంత వినయంగా ఉన్నాడు కదా! మనకు రెండు బలాలు లేవు అయినా మనకు వినయంలేదు. మీకు రామాయణం చదివేటప్పుడు ఇటువంటి ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా? ఇటువంటి ఆలోచన ఎప్పుడూ రాలేదు ఇంక మరి రామాయణం చదవటం వలన వచ్చే లాభం ఏమిటి? ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. వినయంలేని మనిషికి అసలు జ్ఞానం కలగనే కలుగదు.

మనం ఆత్మే అయినప్పటికీ ఆత్మను తెలుసుకోవాలి అని మనకు అనిపిస్తోంది. తెలియటం లేదు అనుకొంటున్నాడు కాబట్టి తెలుసుకోవాలి అనుకొంటున్నాడు. ఆత్మను

తెలుసుకోవాలి అనుకొనే వాడిని పట్టుకో. వాడిని పట్టుకోవటానికి ఏమైనా ప్రయత్నం చేస్తున్నారా? మనందరం బంధంలో ఉన్నాము అనుకొంటున్నాము కాబట్టి మోక్షాన్ని కోరుకొంటున్నాము. బంధమే కనుక నిజమైతే అది ఎక్కడికి పోతుంది. మీరు అబద్దాన్ని పోగొట్టుకోగలరా? ఇప్పుడు మనం జిన్నూరులో ఉన్నాము కాని కోడవల్లిలో ఉన్నాము అనుకొంటే అది అబద్ధం కాబట్టి ఎవరైనా చెపితే పోతుంది జాగ్రత్తగా ఆలోచించండి. మనం అనుకొనేది అబద్ధం కాబట్టి ఏ గురువో చెపుతూ ఉంటే అది పోతుంది. బంధంలో ఉన్న మాట అబద్ధం కాబట్టి అది పోతుంది, అది నిజమైతే ఎలా పోతుంది? మనిషిని అబద్ధం బంధిస్తుంది కాని నిజం ఎప్పడూ బంధించదు. మనం మోక్షంలోనే ఉన్నాము కదా! మరి మోక్షాన్ని ఎందుకు కోరుకొంటున్నాము. ఈ సబ్జక్టు వదిలేసి ఆ దేవుడు గొప్పవాడు, ఈ దేవుడు గొప్పవాడు అంటూ తిరుగుతారు ఎందుకు? మీ బుద్ధికి పనిచెప్పటం మానేసి అలా తిరుగుతారు ఏమిటి?

కొంతమంది దగ్గర పాపం డబ్బు ఉండదు. వారికి లోపల డబ్బు ఆశ ఉంటుంది. డబ్బు ఉన్న వారిని వారు మా చుట్టాలండి అని చెపుతారు. వాళ్ళు ఇచ్చేదీ లేదు, వీళ్ళు పుచ్చుకొనేదీ లేదు. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటి అంటే వాళ్ళను స్మరించే బదులు కష్టపడి మీరే నాలుగు రూపాయలు సంపాదించుకోండి. మీరు సంపాదించుకోవటం మానేసి, మా మేనమామ కొడుకుకు 300 ఎకరాలు ఉన్నాయి అంటే వాడు మీకు ఏమైనా సహాయం చేస్తాడా? ఎందుకు ఇలా కాలాన్ని పాడుచేసుకొంటారు. రమణమహర్షి దగ్గర కూర్చొని ఎవరైనా ఢిల్లీలో ఇలా జరుగుతోంది, మాస్కోలో ఇలా జరుగుతోంది అని ఇటువంటి గొడవలు చెపుతూ ఉంటే ఆ గొడవలు పరిష్కరించే శక్తి నీకు ఉందా? లేకపోతే టైము వేస్టు. నీ సమస్యలు నువ్వు పరిష్కరించుకోలేవు, నీ ఇంట్లో గొడవలు నువ్వు పరిష్కరించుకోలేవు. ఇంక ఆ ఢిల్లీ గొడవల గురించి ఎందుకు అస్తమాను ఆలోచిస్తావు? ఎందుకు కాలాన్ని వృథా చేసుకొంటావు.

ఈ ప్రపంచం అనిత్యం, అశాశ్వతం, దుఃఖాలయం అని పరమాత్మ గీతలో చెప్పాడు. మన కళ్ళకు కనిపిస్తున్న ప్రపంచాన్ని దేవాలయం అనలేదు, దుఃఖాలయం అన్నాడు. ప్రపంచం నిజమైతే అది దుఃఖాన్ని ఎందుకు తీసుకొనివస్తుంది. అంటే ఎప్పడైతే ఈ ప్రపంచం దుఃఖాలయం అన్నాడో అది అబద్ధం అని తెలుస్తోంది కదా! అబద్ధంలో నుండే దుఃఖం వస్తుంది, నిజంలో నుండి దుఃఖం రాదు. ఈ ప్రపంచం అనిత్యం, అశాశ్వతం కాబట్టి అది దుఃఖాలయం. భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి స్వామీ ఈ ప్రపంచాన్ని బాగు చెయ్యాలనుకొంటున్నాను అన్నాడు. ఈ ప్రపంచం నన్ను బాగుచెయ్యమని ఎప్పడైనా నిన్ను అడిగిందా అన్నారు భగవాన్. లేదు

అని చెప్పాడు. ఇంక ఆ గొడవ ఎందుకు? ఇక్కడ ఒక రహస్యం ఉంది. ఒక నాయకుడుకాని, మీరుకాని, నేనుకాని ఎవ్వరూ ఈ ప్రపంచానికి ఉపకారం చెయ్యాలంటే చెయ్యలేరు. మిమ్మల్ని మీరు ఎంతవరకు పవిత్రం చేసుకోగలిగారో అంతవరకు ఈ లోకం బాగుపడుతుంది. మామూలుగా ఎవరూ ఈ లోకాన్ని ఉద్ధరించలేరు. మిమ్మల్ని మీరు పవిత్రం చేసుకోకుండా లోకాన్ని బాగుచెయ్యాలంటే ఎవరివల్లాకాదు, అలా ఎప్పడూ లోకం బాగుపడదు. జ్ఞాని ఏమీ పని చేయటం లేదు కదా! వాడివలన లోకానికి ఏమి ఉపకారం జరుగుతుంది అని మీకు అనిపిస్తుంది. ఇదే ప్రశ్న భగవాన్‌ను అడిగారు. మీరు కూర్చుని ఉంటున్నారు ఏమి పని చెయ్యటం లేదు అన్నారు. స్పీడుగా తిరిగే ఫ్యాన్ రెక్కలు మన కంటికి కనబడవుకాని గాలి వీస్తుంది. అక్కడ రెక్కలు కనబడటంలేదు అంటే ఫ్యాన్ తిరగటం లేదనా? కాదు. జ్ఞాని చేసే పని అలాగే ఉంటుంది, అది మీ కళ్ళకు కనబడదు. నేను ఉపకారం చేసాను అని అందరూ అనుకోవాలి అని అజ్ఞాని అనుకొంటాడు కాని జ్ఞాని అలా అనుకోడు ఎందుచేతనంటే తనకంటే భిన్నంగా మిమ్మల్ని చూడడు. అందుచేత అలా అనుకొనే సమస్యలేదు. అజ్ఞానికి ఇతురులు ఉన్నారు కాని జ్ఞానికి ఇతురులు లేరు. ఇప్పడు సబ్జక్టు ఏమిటి అంటే మనందరం బంధంలో వున్నాము అనుకొంటున్నాము కాబట్టి మోక్షం కావాలి, మోక్షం కావాలి అనుకొంటున్నాము. మోక్షాన్ని కోరేటప్పడు కూడా మనం నిజంగా మోక్షంలోనే ఉన్నాము. ఈ మాట అబద్ధం అయితే అసలు మనకి మోక్షం రాదు.

ఒక చిన్న రహస్యం చెపుతాను మనస్సులో పెట్టుకోండి. ఈ జన్మకైనా, మరొక జన్మకైనా రాగం ఉన్న వాడికి రోగం వస్తుంది. రాగం ఎప్పటికైనా రోగంలోనికి దించుతుంది. మనకు జ్ఞానం కలగకపోవటానికి రాగమే కారణం. మనకు మరణం అంటే భయం కలగటానికి కూడా రాగమే కారణం. భీమవరంలో ఒక ముసలాయన ఆయనకు మరణం వచ్చేస్తుందని ముందు ఆ గాదిలో ఉన్న వడ్లు అమ్మేయండి, బేరం ఇచ్చేయండి అంటున్నాడు. అంటే ఆ డబ్బు ఏమన్నా కూడా పట్టుకొనిపోతాడా? అది ఒక ఎమోషన్ అన్నమాట. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే కొంతమంది బద్ధజీవులు ఉంటారు. చేపల్ని రాళ్ళమీద రాసినట్లుగా వారిని రాసేసినా వారికి మోక్షం వచ్చే సమస్యలేదు. చాకలివాడు బట్టలను రాళ్ళమీద బాదేస్తాడు. వాటిని శుభ్రం చేయటానికి అలా బాదుతున్నాడు కాని ఆ బట్టలమీద కోపం కాదు, ఆ బట్టలను చింపేయటానికి కాదు. అలాగే భగవంతుడు ఎవరినైనా కష్టాలకు గురిచేసినా, పరీక్షలు పెట్టినా వాడికి మంచి చేయటానికి, వాడిని బాగుచేసి పవిత్రుడిని చేయటానికే కాని వాడిని

నాశనం చేయ్యటానికి కాదు.

ఈ సత్సంగాల యొక్క లక్ష్యం ఏమిటి అంటే మీకు ఏ రూపంలో కూడా సఫరింగ్ ఉండకూడదు. ఏ రూపంలో కూడా బాధ ఉండకూడదు. మోక్షం కోసం మీరు ప్రయత్నం చెయ్యాలి కాని సఫరింగ్ వద్దు. ఒక కాలు మీదనుంచుని తపస్సు చెయ్యటం, అన్నం మానేయటం, అగ్నిలో నిలబడటం అలాంటి సఫరింగ్ ఏమీ వద్దు. మీరు ఇంటి దగ్గర టిఫిన్ చేసుకొంటున్నారు, రోజూ అన్నం వండుకొంటున్నారు. మోక్షం కోసం ఆమాత్రం శ్రమ కూడా మీరు పడటం నాకు ఇష్టంలేదు. ఇక్కడ కూర్చోవటంలో కూడా టెన్షన్‌గా కూర్చోవద్దు. మీరు ఇంటి దగ్గర ఎలా కూర్చుంటారో అలాగే కూర్చోండి. టెన్షన్ అసలు వద్దు. ఆడంబరాలకు టైము ఖర్చు పెట్టవద్దు. ఆడంబరాలవలన మన స్వరూపానికి దూరమవుతాము. మోస్ట్ నేచురల్‌గా ఉండండి. మీరు నేచురల్‌గా ఉంటే సింపుల్‌గా ఉంటే మీకు జ్ఞానం వచ్చేస్తుంది, జ్ఞానం వరించి, వరించి మీమీద పడుతుంది. మీరు నేచురల్‌గా, నార్మల్‌గా ఉండండి అంతకంటే ఏమీ లేదు. శాస్త్రాలలో, పురాణాలలో చాలా సాధనలు చెప్పారుకదా, వాటిలో ఇలా ఉంది కదా అని మీరు అడగవచ్చు, ఆ పుస్తకాలలో చెప్పిన మాటలు నేను కాదనటంలేదు. మీరు కల్పించుకొన్న గొడవ మీచేత విడిచిపెట్టించటం కోసమే ఈ సాధనలు అన్నీ. మీరు చేసే సాధన నిజాన్ని గెంటేస్తుందా? అంత గొప్పదా మీ సాధన. సత్యాన్ని గెంటేసే శక్తి మీ సాధనకు ఉందా? మీరు కల్పించుకొన్నది మీచేత విడిచిపెట్టించటం కోసమే సాధన. మీరు కల్పించుకొన్నది కాల్చేయటం కోసమే ఈ సాధన.

ఈరోజు నాన్నగారు ఏమి చెప్పారు అని ఇంటికి వెళ్లిన తరువాత మీరు అనుకొంటే ఏమీ కనబడదు. నేను ఏదైనా కథ చెప్పానా మీకు అంటే ఏమీ లేదు. సీతగురించి, రాముడు గురించి నేను చెప్పాను అనుకోండి, మీరు ఇంటికి వెళ్లి చెపుతారు. కాని ఇప్పుడు మీరు ఇంటికి వెళ్లి ఏమి చెప్తారు, నా మాటలు మీరు చెప్పలేరు కదా! జిన్నూరులో 6వేల మంది జనాభా ఉన్నారు. ఆ సంగతి నాకు తెలియదు అనుకోండి, నాకు వచ్చే నష్టం ఏమిటి? ప్రధానం కాని విషయాలకు జీవితమంతా మనటైము, డబ్బు, శక్తి, యుక్తి అన్నీ ఖర్చు పెట్టేస్తున్నాము. చివరకు మనకి జీవితంలో మిగిలేది పొల్లు. మీరు ఎందుకు ఇది ఆలోచించరు? మీకు 60 సంవత్సరాలు, 70 సంవత్సరాలు వయస్సు ఉంది కదా! ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి. మనం 60 సంవత్సరాల జీవితంలో ఏమి చేసాము అంటే మనకు ఏమీ కనబడదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

సెప్టెంబర్ 1        జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం

**సెప్టెంబర్ 23వ తేదీ సద్గురు శ్రీ నాన్నగారు పుట్టినరోజు చేసుకోవటం లేదు. ఆ రోజు ప్రవచనం ఉండదు.**

# శ్రీకృష్ణాష్టమి

అవతార పురుషుల, మహాత్ముల పుట్టినరోజులు జరుపుకోవడం మన సాంప్రదాయంగా వస్తోంది. శ్రీకృష్ణుడు దేహం ధరించినరోజు 'శ్రీకృష్ణాష్టమి' మనకు ఎంతో పవిత్రమైనది, మరియు యావత్ సృష్టికి పండుగ రోజు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున శ్రీకృష్ణాష్టమిని జరుపుకుంటాం. సకల చరాచర సృష్టికి ఆధారమైన అనంత, అద్వయ చైతన్యమే అద్భుత బాలునిగా రూపుధరించిన రోజు. దేవకీ గర్భమున జన్మించినట్లు కనబడిన ఆ బాలుడు యశోద గృహమున పెంచబడినాడు. ఆయన మనలాగా పుట్టనూలేదు, అలాగే మరణించనూ లేదు. తన యోగమాయ ద్వారా అలా కనిపించి అదృశ్యమయ్యాడు. ఆయనది పరిపూర్ణావతారం, శ్రీకృష్ణుడు లీలా పురుషోత్తముడు. తాను భూమిపై సంచరించినప్పుడు విభిన్న పాత్రలను పోషించాడు. శ్రీకృష్ణుడు స్వయంగా భగవంతుడు అన్నది భాగవతోక్తి. శ్రీకృష్ణుడు అంటే సచ్చిదానంద స్వరూపుడు, సర్వజ్ఞుడు, జగద్గురువు, జగన్నాథుడు, యోగీశ్వరుడు, పరమ ప్రేమస్వరూపుడు. అట్టి పరమాత్మ జీవకోటి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు. సకలమునకు ఆధారమైన సచ్చిదానంద పరమాత్మే భక్తులను అనుగ్రహించుటకు, దుష్టశిక్షణకొరకు, ధర్మసంస్థాపన కొరకు, ఒక మానవాకారం ధరిస్తే అదే దేహధారియైన శ్రీకృష్ణపరమాత్మ. పరమాత్మ యొక్క లీల ఎలా ఉంటుందో, ఆయన కళ్యాణగుణాలు ఎలా ఉంటాయో, మనకు చూపించడానికి భగవంతుడు శ్రీకృష్ణరూపం ధరించివచ్చాడు. శ్రీకృష్ణుడు అణువుకన్న చిన్నవాడు, ఈ సకల చరాచర సృష్టి కన్నా పెద్దవాడు. అట్టి పరమాత్మ భగవద్గీత ద్వారా దేశ, కాల, కారణాలకు, అతీతమైన దివ్య జ్ఞానబోధను అందించాడు. శ్రీకృష్ణుని మానవతాకోణం అద్భుతం. మానవుని ఆలోచనా సరళిని ప్రభావితం చెయ్యడంలో శ్రీకృష్ణుని పాత్ర అద్వితీయం. గంగాజలం శరీరాన్ని శుద్ధి చేస్తే, శ్రీకృష్ణుని బోధ మనస్సుని పరిశుద్ధం చేస్తుంది. శ్రీకృష్ణుని సందేశం సకల మానవాళి అశాంతికి, దుఃఖానికి అద్భుతమైన ఔషధం. ఆయన ప్రతిమాట, ప్రతిచర్య, మానవజాతికి మహత్తరమైన సందేశమే! ఆయన బోధను అర్థం చేసుకొని, ఆచరణలో పెడితే, అజ్ఞాన భ్రాంతినుండి విముక్తులమై అమృతస్వరూపులమవుతాము!

**(దిll 25-08-2016 శ్రీకృష్ణాష్టమి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిరహంకారి మాత్రమే - నిర్వికారంగా ఉండగలడు

నేను మహాపండితుణ్ణి నాకు అన్నీ తెలుసు అసలు నా మాట వింటే ప్రపంచము ఎప్పుడో బాగుపడును అని అహంకారి తనలో తనే గొణుక్కుంటాడు. ఈ భావాలు ఉంటే విశాలభావాలకు చోటు ఉండదు. నీటి వల్లనే మంచు గడ్డ ఏర్పడుతుంది. తిరిగి మంచుగడ్డ కరిగి నీరైనది. అహంకారం ఆత్మ వెలుగులోనే బ్రతుకుతుంది. అహంకారం గడ్డ కట్టటం వలనే అనేక వికారాలు వస్తాయి. నాకు ఏమీ తెలియదు నావల్ల ఏమీ జరగటంలేదు పరమాత్మచేతిలో ఒక కీలుబొమ్మను అని భావిస్తే అహంకారం కరిగిపోతే, ఆత్మలాగే ఉండగలము. "ఆత్మ ఎట్లా ఉందో అది ఎప్పడు అట్లాగే ఉంది. ఈ బుడబుక్కల మనసే గోల చేసేది. ఇక చెప్పటానికి ఏముంది? అహంకారం ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏమీ లేదు" అంటారు శ్రీ నాన్నగారు. మనస్సులో ఏవికారం లేకపోతే మేఘాలు లేని నిర్మల ఆకాశంలాగా, కెరటాలులేని నిర్మల సరస్సులాగా ఉంటుంది. మన శరీరం మరణిస్తే పూచికపుల్లకూడా మన వెంటరాదు. భార్య ఎంత ఏడ్చినా ఇల్లు దాటిరాదు. బంధువర్గం కొందరు స్మశానం వరకూ వస్తారు. మన దేహం చితివరకే వస్తుంది. జీవుడి కూడా వచ్చేది ధర్మం మాత్రమే ఇన్నీ తెలుసున్న పండితుణ్ణి కూడా ఇంద్రియాలు పట్టి ఈడ్చుకొనిపోతాయి. కాకిరెట్టను చూస్తే ఎంత రోత కలుగుతుందో విషయాలపై మనం అలా ఉంటే వైరాగ్యం సిద్ధిస్తుంది. బుద్ధిని మోహింపచేసే ఆశను శోకింపజేసే నిరాశను ఒకేసారి విడిచిపెడితే వైరాగ్యం కలిగి నిర్వికారంగా ఉండగలడు. ఆలోచనలకు సొంతజీవితం అంటూ లేదు అవి వాసనలను బట్టి బ్రతుకుతాయి. మనం వాటితో కలిసిపోయి జీవిస్తున్నాము. మనం కోపంగా ఉన్నామంటే మనమే కోపానికి జీవనశక్తి ఇస్తున్నాము. మనం అందులో మిళితమైపోయి ఉన్నాము. మనం ఆలోచనలకు దగ్గరగా ఉంటే వాటిని మనం గమనించలేము అవి మనకు అలంకారమైపోతాయి. కోపంతో మనం పిచ్చివాడిగాను, ఆశతో ఆశాపాతునిగాను, కామంతో కామిగాను తయారు చేస్తుంది. అవి అన్ని మనలను కప్పేసి ఉన్నాయి. ఆలోచనలు మనం ఒకటే అనుకోవటం వలన వచ్చిన తంటాలు, తగువులు. దుఃఖాన్ని తీసుకొని వచ్చే ఇటువంటి పనులలో మునిగిపోకూడదు. సాధారణ జీవి ఆలోచనలు లేకుండా ఒక్క క్షణం ఖాళీ లేకుండా ఉండలేడు ఆలోచనలు ఎప్పడూ తన్నుకుంటూ ఒకదానిమీద ఒకటి ప్రవాహంలా చిన్న విరామం లేకుండా కొనసాగుతాయి. మనం సూక్ష్మదృష్టితో మన మనస్సును పరిశీలిస్తే మనకే తెలిసిపోతుంది. భగవాన్ "మీ మనస్సు కదిలిపోతున్నది అంటున్నారు నా మనస్సు కదలమన్నా కదలటంలేదు" అన్నారు. జ్ఞాని స్థితి అది. పోనీ మనం నిద్రలో ఉన్నా మనకు కలి కలలు అన్నీ దృశ్యరూపంలోని మన ఆలోచనలే. జాగ్రదవస్థలో మనం దర్శించేవే నిద్రలో అవి తారసపడతాయి. సాధకుడు జాగ్రదవస్థలో నిగ్రహించుకొన్నా వాసనలు నిద్రలో మన ఆట సాగనియ్యకుండా యధేచ్ఛగా సాగుతాయి దీని ప్రవాహాన్ని ఆపలేము. మన సాధన పురోభివృద్ధి ఎలా ఉందో తెలియటానికే ఈశ్వరుడు కలలు అనే జ్వరం ఎలా ఉందో తెలియటానికి ధర్మామీటరులా నియమించాడు దానికి ఇంతకన్న ప్రయోజనం ఏమీ లేదు. దానికి కరుణాకటాక్షం ఒక్కటే మందు. దానితో ఆలోచనల నుండి విరక్తులమై నిర్వికారంగా ఆత్మగా తేజరిల్లుతాము. అంతే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**